# నెగ్గని వారెవరు!

ఈశ్వర్ దంపతులకు చాలా ఏళ్ళ తరువాత ఒక ఆడపిల్ల కలిగింది. దురదృష్టవశాత్తు పిల్లకి ఎడమ చేయి లేదు. 'పెళ్లి ఎలా చేయాలా?' అని దిగులు పడింది తల్లి. తన తమ్ముడు వచ్చినప్పుడల్లా 'అసలు దీనికి పెళ్లి చేయగలమంటావా?' అంటుండేది.

'ఒక్క అవయవం మాత్రమే లేదుగానీ దానికి మిగిలిన అవయవాలు లక్షణంగానే వున్నాయి కదా! అయినా ఇప్పుడు దీనికి పదిహేను సంవత్సరాలే కదా. దేవుడు సహాయం చేయకపోతాడా?' అనే వాడు పిల్ల మేనమామ.

---

పిల్లకి పెళ్లీడు వచ్చింది. పెళ్ళి సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. ఓసారి పెళ్లిచూపులకి కూర్చోబెట్టారు. మేనమామ ఆ ఎడం చేతి వైపు భాగం పమిట కొంగుతో కనబడకుండా జాగ్రత్త పడమని తన అక్కయ్యకి చెప్పాడు.

పిల్లాడు చాలా బాగున్నాడు. ఓ తలపాగా చుట్టుకుని మంచి హుందాగా చెప్పాడు.

"ఈ తలపాగా చుట్టుకోవడం మంచి సాంప్రదాయం. పూర్వం కాలేజీకి వెళ్లి చదువుకునేవారు. అసలు ఈ పాగావల్ల వేసవికాలంలో ఎంత ఎండలో వెళ్లినా వేడిగాలి చెవుల్లోంచి వెళ్లదు." అంటూ మొదలుపెట్టి కాబోయే వరుడికి తలపాగాతో వచ్చినందుకు పెళ్లివారిని పొగిడారు పిల్ల మేనమామ. ఇంతలో పిల్లాడి పినతండ్రి "ఓ చిన్న మనవి" అంటూ మొదలుపెట్టి "ఈ తలపాగావల్ల శీతాకాలంలో చలిగాలి కూడా చెవుల్లోకి వెళ్లదు" అన్నాడు.

వాళ్లని పొగిడితే ఉబ్బితబ్బిబ్బయిపోతారని "చాలా మంచి విషయం చెప్పారు. ఈ విషయం నాకు తట్టలేదండీ" అన్నాడు పిల్ల మేనమామ.

"అందుకే ముఖే ముఖే సరస్వతి అన్నారు. అన్ని విషయాలు అందరికీ తట్టవులెంటి" అన్నాడు పిల్లవాని పినతండ్రి తనే పెద్ద మేధావి అయినట్టు. పెళ్లిచూపులు సక్రమంగా అయ్యాయి. సంబంధం నిశ్చయమైంది.

---

పెళ్లి తంతు జరుగుతోంది. తలంబ్రాలు మగ పెళ్లివారికి ఆనవాయితీ లేదన్నారు. "మీ ఇష్ట ప్రకారమే జరిపిద్దాం" అన్నారు ఆడపెళ్లివారు.

పెళ్లయిపోయింది తలంబ్రాలు మినహాయింపుతో! ఆడపెళ్లివారు తమకి అప్పగింతలు ఆనవాయితీ లేదన్నారు.

"అదేమిటండీ! పెళ్లిచేసి మరి పిల్లని అప్పగించకపోతే ఎలా?" అన్నారు మగపెళ్లివారు.

"అప్పగింతలు చేసేటప్పుడు అందరూ కన్నీళ్లు పెట్టుకుంటారు. అసలు పెళ్లి కార్యక్రమం కన్నీళ్లతో ముగియడం అశుభం" అన్నారు పిల్ల తరపువాళ్లు.

అసలు కారణం ఇదికాదు. పిల్లకి ఒక చెయ్యే ఉంది. అప్పగింతలు చేసేటప్పుడు పిల్ల రెండు చేతులూ పాలల్లో ముంచి మగపెళ్లివారికి అప్పచెప్పాలి. మరి పిల్లకి ఒక చెయ్యే ఉన్న విషయం బయట పడుతుందన్న భయంతో అప్పగింతల అనవాయితే లేదన్నారు.

అప్పగింతలు లేవు. కార్యక్రమం ముగిసింది. అంతా అయిపోయిన తరువాత 'నెగ్గా తమ్ముడూ' అంది పిల్లతల్లి.

పిల్లాడి తలపాగా తీసేసారు మగపెళ్లివారు. పిల్లాడికి ఒక చెవి లేదు. అందుకే ఆ తలపాగా చెవుల చుట్టూ బిగించి కట్టారు.

చెవిలేమి చూసి ఆడపెళ్లివారు ఆశ్చర్యపడుతుంటే "మరి నెగ్గనివారెవరు" అన్నారు వాళ్లు.

"ఓహో అందుకా తలంబ్రాలు లేవన్నారు. తలంబ్రాల బియ్యం వరుని నెత్తిమీద పోసేటప్పుడు తలపాగా తీసెయ్యాలి. అప్పుడు చెవిలేమి బయటపడుతుంది. ఓహో మగపెళ్లివారు కూడా ఘటికులు" అనుకున్నారు ఆడపెళ్లివారు.

పెళ్లికూతురికి ఒక చేయి లేదని మగపెళ్లి వారందరికీ తెలిసిపోయింది.

"చిన్న చెవి లేకపోతే ఫర్వాలేదుగాని ఓ చెయ్యే లేకపోతే ఎలా?" అన్నారు కొందరు.

"అసలు పుట్టినప్పుడు చెవి ఉండేది. తరువాత పోయిందని చెప్పి, రెండు చేతులూ ఉన్న పిల్లని తెచ్చి పెళ్లి చేయవలసింది" అన్నారు మరికొందరు మగపెళ్లివారు.

"మధ్యలో పోయిందనడానికి ఇదేం తాళంచెవి కాదు కదా" అన్నారు కొంతమంది.

మీరు మోసం చేసారంటే మీరు మోసం చేసారని వాదులాడుకున్నారు ఉభయ పక్షాలు.

"చెవి అయితే కనబడకుండా తలపాగా చెయ్యొచ్చుగాని చేయి లేకపోతే ఎలా?" అన్నారు పిల్లాడి తరపువాళ్లు.

"మీకు ఇంకా అర్థం కాలేదు. పమిట కొంగు కప్పేస్తే చెయ్యి లేనట్లు తెలీదు" అన్నారు పిల్ల తరపువాళ్లు.

"ఎలాగో అలాగ ఏడవండి. మేం వెళుతున్నాం అన్నారు చుట్టాలు.

---

(ఆంధ్రభూమి మాసపత్రిక సెప్టెంబర్ 2012)